




శ్రీరామ ఎత్తిపోతల పథకం నుంచి సోమశిల బ్యాక్ వాటర్ వద్ద నిర్మించిన పంపింగ్ హౌస్ నుండి ఒక మోటర్ ద్వారా ఒంటిమిట్ట చెరువుకు మంగళవారం సాయంత్రం అధికారులు నీటిని విడుదల చేశారు. - ప్రజాశక్తి-ఒంటిమిట్ట

వామ్మో..డెంగీ!!



- జిల్లాలో 474 కేసులు నమోదు
- ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రులు కిటకిట
- సామాన్యుల జేబులకు భారీగా చిల్లులు

జిల్లాను డెంగీ జ్వరం వణికిస్తోంది. టైఫాయిడ్, డయేరియా కేసుల సంఖ్య పెరుగుతోంది. పారిశుధ్యం, దోమకాటు, తాగునీటి కలుషితం ద్వారా ప్రబలుతున్నట్లు వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా వాతావరణ మార్పులు, ఇటీవల అడపాదడపా వర్షాలు, అధ్వాన పారిశధ్యం నేపథ్యంలో జ్వరపీడితుల సంఖ్య పెరుగుతోంది. మున్సిపల్, ఆర్‌డబ్ల్యుఎస్, డిఎంహెచ్ఒ, పారిశుధ్యశాఖల ప్రణాళికా లోపం వల్లే ప్రజారోగ్యానికి తీరని నష్టం వాటిల్లుతోందనే వాదన వినిపిస్తోంది. వీటి నిర్లక్ష్యం కారణంగా జిల్లా వ్యాప్తంగా వారం రోజుల వ్యవధిలోనే 474 మంది జ్వరాల బారిన పడినట్లు రికార్డులను పరిశీలిస్తే తెలుస్తోంది.



ప్రొద్దుటూరు ఆస్పత్రిలో ఓపి కోసం వేచి ఉన్న రోగులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో డెంగీ జ్వరం విస్తరిస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు నాటికి 474 మంది జ్వరాల బారిన పడిన తీరు ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలోనే 36 మండలాల్లోనే పెద్దసంఖ్యలో డెంగీ కేసులు నమోదయ్యాయి. ఈలెక్కన మండలానికి 13 నుంచి 15 మందికి పైగా డెంగీ జ్వరాల బారిన పడ్డారు. ఇది ప్రభుత్వాస్పత్రుల్లో నమోదైన అధికారిక లెక్కలు మాత్రమే. ప్రయివేటు ఆస్పత్రులకు చేరిన కేసుల సంఖ్య ఇంతకు మూడు రెట్లు ఉండే అవకాశం ఉందనే అంచనాలు ఉన్నాయి. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్, పంచాయతీ, ఆర్‌డబ్ల్యుఎస్, పారిశుధ్య శాఖలు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉరుముతోంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పదుల సంఖ్యలో శాంపిల్స్ సేకరి స్తున్నారు. ఇప్పటికే సుమారు 50 మంది జ్వర పీడితులు చికిత్స తీసుకుంటున్నారు. వారం రోజుల వ్యవధిలో 88 టైఫాయిడ్ శాంపిల్స్ సేకరిం చడం తీవ్రతకు అద్దం పడుతోంది. 2023 జనవరి నుంచి డిసెంబర్ వరకు 270 డెంగీ కేసులు నమోద య్యాయి. 2022లో 391, 2023లో 270 డెంగీ కేసులు జిల్లాను చుట్టుముట్టడంతో తిరుపతి, కర్నూ లు, చెన్నయ్ పట్టణాల్లోని ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రులకు జ్వర పీడితులు పరుగులు తీసిన అనుభవం కళ్లముందే కనిపిస్తోంది. అమాంతంగా పడిపోతున్న ప్లేట్‌లెట్ల భయంతో పరుగులు తీసిన సంగతి తెలిసిందే. ఇటువంటి భయానక పరిస్థితులు పునరావృతం గాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. జిల్లాలో ఒంటిమిట్ట నుంచి కొండాపురం వరకు పల్లె, పట్నమనే తేడా లేకుండా జ్వర పీడితులే ఉండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రులు జ్వరపీడితులతో కిటకిటలాడుతున్నాయి. జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందడంపై భరోసా లేకపోవడంతో ప్రయివేటు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. పంచాయతీరాజ్, మున్సిపల్ పారిశుధ్యశాఖ, ఆర్‌డబ్ల్యుఎస్, డిఎంహెచ్ఒ మధ్య సమన్వయం కొరవడడంతో జ్వర పీడితుల సంఖ్య పెరుగుతోందనే విమర్శలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 474 అనుమానిత డెంగీ, టైఫాయిడ్, మలేరియా, సాధారణ జ్వరాలు, 2,599 డయేరియా కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు వర్షాలు ఎక్కువగా పడే అవకాశాలు ఉన్న నేపథ్య ంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్, పంచా యతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖలు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

జ్వరాల తగ్గుదలకు చర్యలు

జ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకున్నాం. జిల్లాలోని తొమ్మిది గ్రామాలను హాట్‌స్పాట్ కేంద్రాలుగా గుర్తించాం. జిల్లా వ్యాప్తంగా డెంగీ, టైఫాయిడ్ జ్వరాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. జ్వరాల నియంత్రణకు వైద్య శిబిరాల నిర్వహణ దగ్గర నుంచి మురుగునీటి నిల్వలపై క్రిమిసంహారక మందులను స్ప్రే చేస్తున్నాం.

- శశిభూషణ్‌రెడ్డి, ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఒ, కడప.

రెవెన్యూ సదస్సులు చక్కటి అవకాశం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రెవెన్యూ సదస్సుల నిర్వహణ ద్వారా గ్రామాల్లో దీర్ఘ కాలికంగా అపరిష్కృతంగా ఉన్న భూసమస్యల పరిష్కారానికి ఒక చక్కటి అవకాశమని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో అమలు చేస్తున్న రెవెన్యూ సదస్సుల ప్రణాళిక, కార్యాచరణపై జెసి అదితి సింగ్, డిఆర్ఒ గంగాధర్ గౌడ్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. గౌరవ అతిథులుగా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో త్వరలో చేపడుతున్న రెవెన్యూ సదస్సుల నిర్వహణకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఆ మేరకు జిల్లాలో ప్రణాళిక ప్రకారం నిర్ణయించిన తేదీలో, నిర్దేశించిన గ్రామంలో ఉదయం 9 గంటల నుండి నిర్దేశించిన ప్రదేశంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. మండల రెవెన్యూ అధికారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్, మండల సర్వేయర్, దేవాదాయ శాఖ, వక్ఫ్ బోర్డు, రిజిస్ట్రేషన్ శాఖ, అటవీ శాఖ, పోలీసు అధికారులు, బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ ప్రతినిధులు రెవెన్యూ సదస్సులకు హాజరై అధికారుల దృష్టికి తీసుకురాను న్నారన్నారు. రెవెన్యూ సదస్సులలో మ్యూటేషన్లు, భూ వివాదాలు, భూ ఆక్రమణలు, 22-ఎ దుర్వినియోగం మొదలగు అంశాలపై గ్రామస్తుల నుంచి అర్జీలు స్వీకరించి వెంటనే రశీదు జారీ చేస్తారన్నారు. కార్యక్రమంలో కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్‌డిఒలు వెంకటపతి, శ్రీనివాసులు, చంద్రమోహన్, వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, రైతు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

విమానాశ్రయ అభివృద్ధికి చర్యలు

పర్యావరణానికి ఎలాంటి అంతరాయం లేకుండా, నిబంధనలకు లోబడి కడప ఏరోడ్రమ్ అభివృద్ధి పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్, ఏరోడ్రమ్ కమిటీ చైర్మన్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. మంగళవారం కడప విమానాశ్రయం టర్మినల్ భవనంలో కడప ఏరోడ్రమ్, ఎయిర్ ఫీల్డ్ ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సేఫ్టీ, సెక్యూరిటీకి సంబంధించిన పలు విషయాలను, ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు, విమానాశ్రయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ చర్చించింది. కార్యక్రమంలో ఎస్‌పి హర్షవర్ధన్ రాజు, డిఎఫ్ఒ సందీప్ రెడ్డి, విమానాశ్రయం డైరెక్టర్, కమిటీ కన్వీనర్ సుజిత్ కుమార్ పోదర్, ఎపిఎస్‌పిఎఫ్ కాషో ఆనందయ్య, సభ్యులు అదనపు మున్సిపల్ కమిషనర్ రాకేష్ చంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అన్నదాతల కోసం దశలవారీ పోరాటాలకు సిద్ధం

ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామని ఇచ్చిన హామీని అమలు కోసం రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీగా పోరాటాలకు శ్రీకారం చుడుతున్నట్లు ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం చింతకొమ్మదిన్నె మండలం కొలుములపల్లె రైతు సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమకు ఇచ్చిన హామీలు అమలు అవుతాయని, తమ కష్టాలు కొన్నైనా పరిష్కారం అవుతాయని రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారని ఆయన అన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడిచిపోయిందని, వ్యవసాయానికి పెట్టుబడుల కోసం బ్యాంకులు, ఇతర ప్రయివేటు వడ్డీ వ్యాపారుల చుట్టూ రైతులు, కౌలు రైతులు తిరగాల్సిన దుస్థితి పట్టిందన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవ రూ. 20 వేల పెట్టుబడి సాయం రైతులకు ఎంతో ఉపయోగ పడుతుందని అన్నారు. 2023 ఖరీఫ్, రబీ సీజన్‌లో పంటలు నష్టపోయిన రైతులకు పంటల బీమా పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వ ఒత్తిడితో గత ప్రభుత్వం వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టేందుకు జిఒ నెం. 22 తెచ్చిందని, మీటర్లు పెట్టే ప్రయత్నం చేస్తే అనంతపురం జిల్లాలో రైతులు తిప్పికొట్టారని అన్నారు. మోటర్లకు మీటర్లు పెట్టే విధానం మీటర్లు తయారు చేసే అదాని కంపెనీకి తప్ప రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదని చెప్పారు. వ్యవసా యానికి ఉచిత విద్యుత్ కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. రాయలసీమ, వెనుక బడ్డ ప్రాం తాలలో పెండింగులో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి సత్వరమే పూర్తిచేయాలని కోరుతూ సంతకాల సేకరణ, ఈనెల 9,10 తేదీలలో గ్రామ సచివాలయాలలో వినతిపత్రాలు ఇవ్వడం, 17,18 తేదీలలో మండల కేంద్రాలలో ధర్నాలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రభుత్వంపై వత్తిడి కోసం దశల వారి పోరాటాలకు శ్రీకారం చుట్టి నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో రైతు సంఘం కడప జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోపాలకృష్ణయ్య, దస్తగిరి రెడ్డి, చిన్న సిద్దయ్య, శ్రీనివాసులురెడ్డి, రమణ, హరి పాల్గొన్నారు

కడప 'ఉక్కు'పై తక్షణం చర్యలు చేపట్టాలి

లేనిపక్షంలో ఉద్యమాలు చేస్తాం

కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పణలో పిసిసి చీఫ్ షర్మిల

ప్రజాశక్తి - కడప



మీడియాతో మాట్లాడుతున్న పిసిసి చీఫ్ షర్మిల

కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణంపై తక్షణం చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. మంగళవారం ఆమె కలెక్టర్ శివశంకర్ లోతేటి కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలోని మీడియా పాయింట్ వద్ద మాట్లాడతూ కడప స్టీల్ ప్లాంట్ వైఎస్ఆర్ ఆశయం, సంకల్పమని అన్నారు. ఆంధ్రుల హక్కు కడప స్టీల్ ప్లాంట్ అని అన్నారు. ఎన్ని పార్టీలు అధికారంలోకి వచి నా శంకుస్థాపనలకే స్టీల్ ప్లాంట్ పరిమితమైందన్నారు. వెంటనే స్టీల్‌ప్లాంట్ నిర్మాణం చేపట్టకపోతే కాంగ్రెస్ పార్టీ ఉద్యమాలు, పోరాటాలు పెద్ద ఎత్తున సాగిస్తుందని హెచ్చరించారు. 2014లో రాష్ట్ర విభజన సమయంలో వైఎస్ఆర్ జిల్లాలో ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు యుపిఎ ప్రభుత్వం నిబంధనలు రూపొందించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఈ డిమాండ్‌ను విస్మరించడంతో ఆ తర్వాత వచ్చిన రాష్ట్ర ప్రభుత్వాలు పెదవి విప్పాయి అన్నారు. దశాబ్ద కాలంగా ఉక్కు కర్మాగారం పురోగతిని బిజెపితోపాటు టిడిపి, వైసిపి స్తంభింపజేశాయని అన్నారు. దయచేసి తను సమర్పించిన వినతిని ప్లాంట్ పని తక్షణ ప్రారంభానికి అల్టిమేటంగా పరిగణించాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఇక్కడ స్టీల్ ప్లాంట్ స్థాపించి 25 వేల మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పించాలని చెప్పారు. 20 వేల కోట్ల పెట్టుబడులతో, 20 మిలియన్స్ టన్స్ ఉత్పత్తి సామర్థ్యం తో కడప స్టీల్ ప్లాంట్ స్థాపనను అంతా సిద్ధం చేశారు అని తెలిపారు. 10 వేల ఎకరాల్లో ప్లాంట్ విస్తరణకు అంతా సిద్ధం చేశారు అన్నారు. 2007 జూన్ 10న శంకుస్థాపన కూడా చేశారు?. వైఎస్ఆర్ మరణం తరువాత స్టీల్ ప్లాంట్ నిర్మాణం పునాది రాయిగానే మిగిలింది అన్నారు. 2014లో అధికారంలో వచ్చిన చంద్రబాబు నాలుగున్నర ఏళ్లపాటు కడప స్టీల్ ప్లాంట్ గురించి పట్టించుకోలేదు, ఎన్నికలకు 6 నెలల ముందు 2018లో కడప స్టీల్ ప్లాంట్‌కి మళ్లీ శంకుస్థాపన చేశారు అన్నారు. అధికారంలో వచ్చిన వైఎస్ జగన్ 2019 డిసెంబర్ 23న స్థలాన్ని మార్చి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. తిరిగి 2023 ఫిబ్రవరి 15 న అదే స్టీల్ ప్లాంట్‌కి జగన్ మళ్లీ శంకుస్థాపన చేశారని, ఇలా స్టీల్‌ప్లాంట్ శంకుస్థాపనలకే పరిమితమైందని వాపోయారు. వెంటనే స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అఫ్జల్ ఖాన్, జిల్లా అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు, మధు రెడ్డి, ధ్రువ కుమార్ రెడ్డి, పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, రషీద్, సయ్యద్ సలావుద్దీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు

అక్టోబర్‌లో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు

ప్రజాశక్తి- కడప సిటీ

జిల్లాలో 184 చేనేత సంఘాలకు ఒకేసారి ఎన్నికలు అక్టోబర్ 21 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై డిసెంబర్ 6న ముగుస్తుందని జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు జి. నాగరాజారావు వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని జిల్లా నీటి యాజమాన్య సంస్థ సమావేశపు హాలులో చేనేత సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాలకు సంబంధించిన బైలా కాపీలు, మినిట్స్ బుక్, క్యాష్ బుక్, సభ్యుల జాబితా, రెండు రకాల సీల్లు చేనేత జౌళి శాఖ కార్యాలయంలో అందించాలన్నారు. చనిపోయిన సొసైటీ సభ్యులను రౌండప్ చేయాలన్నారు. సొసైటీకి సంబంధించి గ్రామాలలో లేని వారిని కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగించాలన్నారు. సంఘ కార్యకలాపాల్లో రెగ్యులర్‌గా పాల్గొనని వారికి ఓటు హక్కు ఉండదన్నారు. సొసైటీకి, బ్యాంకుకు సంబంధించిన డబ్బులు సకాలంలో చెల్లించనివారికి కూడా ఓటు హక్కు ఉండదన్నారు. ఎన్నికల వ్యయాన్ని సహకార సంఘాలే భరించాలన్నారు. రికార్డులు సక్రమంగా సమర్పించిన సంఘాలకే కలెక్టర్ అనుమతితో ఎన్నికలు నిర్వహిస్తామని వివరించారు. చేనేత సహకార సంఘాల ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు సంఘాల ప్రతినిధులు పూర్తిగా సహకరించాలన్నారు. సమావేశంలో వెంకటేశు, ఉప్పు మల్లికార్జున, కేతినేని శివ, కంచన శివప్రసాద్, బండి సుబ్బయ్య, డెవలప్మెంట్ ఆఫీసర్స్ మహమ్మద్ మోదీన్, డి కృష్ణ, పి నారాయణమ్మ, సివి శేషగిరిరావు, రవి ప్రకాష్ రెడ్డి, ఆర్ వనిత , అటెండర్లు బి జయరాం, బాలకృష్ణ, చేనేత సహకార సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

చిల్లర రాజకీయాలు చేయడం తగదు

ప్రజాశక్తి - కడప అర్బన్

విజయవాడ ప్రజలు వరద బీభత్సంతో అల్లాడుతుంటే మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి చిల్లర రాజకీయాలు చేయడం సిగ్గుచేటని టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి హరి ప్రసాద్ అన్నారు. మంగళవారం హరి టవర్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో విజయవాడ మొత్తం వరదలతో మునిగిపోయిందన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు విజయవాడ కలెక్టరేట్‌లో మకాం వేసి ఎప్పటికప్పుడు ప్రజల స్థితిగతులను చూస్తున్నారన్నారు. స్వయంగా సిఎం ముంపు ప్రాంతాలలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డి సిఎంగా ఉన్నప్పుడు ఎన్ని తుఫాన్లు వచ్చినా ఒక్కసారి కూడా బయటికి రాలేదని చెప్పారు. రాజకీయాలు మాట్లాడకుండా వరద బాధితులకు ఏమన్నా సహాయం చేయాలని హితవు పలికారు.

గర్భిణుల నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి -వల్లూరు



ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ

ప్రతి ఆశా వర్కర్ గర్భిణుల నమోదు వందశాతం చేయాలని జిల్లా వైద్యా అధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశాల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు, యుక్తవయస్సు వారందరికీ జ్వరం మాత్రలు మింగించాలని పేర్కొన్నారు. రక్తహీనత నుంచి కాపాడాలని తెలిపారు. ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల మందులు అందు బాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పిహెచ్ సి డాక్టర్ పనీంద్ర, రమేష్ రెడ్డి, ఐడిఎస్పి అధికారి ఖాజాముద్దీన్, సిహెచ్ఒ వేణుగోపాల్, ఎంపిహెచ్ ఇయు ప్రసాద్, సుధాకర్, మమత, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్



వినతి పత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

ఆశా కార్యకర్తల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి డిమాండ్. మంగళవారం నగరంలోని డిఎంహెచ్ఒ కార్యాలయంలో అదనపు డిఎంహెచ్ఒ అధికారికి ఉమామహేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు వేతనాలు పెంచాలని, 2024, ఫిబ్రవరి 9న రాష్ట్రప్రభుత్వం ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రతినిధి వర్గంతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాల జిఒలు, సర్క్యులర్స్ వెంటనే విడుదల చేయాలని కోరారు. ఆశా వర్కర్ల వేతనాలు పెంచాలని కోరారు. ఆశా వర్కర్ల సమస్యలపై కుటుంబ సంక్షేమశాఖ అధికారులు యూనియన్ రాష్ట్ర ప్రతినిధి వర్గంతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాల జిఒలు వెంటనే విడుదల చేయాలని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆశా వర్కర్లకు జిఒలు వెంటనే విడుదల చేయాలి కోరారు. పనిభారంతో అల్లాడుతున్న ఆశావర్కర్ల సమస్యలపై సార్వత్రిక ఎన్నికలరీత్యా జాయింట్ మీటింగ్స్ నిర్వహించలేదని చెప్పారు. మెజారిటీ ఆశాలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని తెలిపారు. ఒక గంట అనుమతి కావాలన్నా, ఒకరోజు సెలవు కావాలన్నా అధికారుల దయా దాక్షిణ్యలపై ఆధారపడాల్సి వస్తోందని చెప్పారు. ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్తలను పోస్టును తక్షణం భర్తీ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె. ఓబుల్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రాచీన శాసనానికి పట్టం కట్టిన కలెక్టర్

ప్రజాశక్తి - కడప అర్బన్

కలమల్లలో నిర్వహించడంలో తెలుగు భాషా దినోత్సవం వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించడంలో క్రియాశీలక పాత్ర పోషించిన కలెక్టర్ లోతేటి శివశంకర్‌ని తెలుగు భాషోత్సవ నిర్వహణ కమిటీ ఘనంగా సత్కరించింది. మంగళవారం కలెక్టర్ బంగ్లాలో డిఇఒ యం.అనురాధ ఆధ్వర్యంలో కమిటీ కలెక్టర్‌ను సన్మానించింది. ఈ సందర్భంగా భాషోత్సవ నిర్వహణ కమిటీ సమన్వయకర్తలు మేరీ, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ క్రీస్తు శకం 575 సంవత్సరంలో రేనాటి చోళరాజు ధనుంజయుడు వేయించిన కలమల్ల శాసన వైభవాన్ని కలెక్టర్ గుర్తించి కలమల్లకు పూర్వ వైభవాన్ని తీసుకువచ్చారని తెలిపారు. తెలుగు భాషకు ప్రాచీనహోదా కల్పించడంలో ప్రధాన భూమిక పోషించిన శిలా శాసనాన్ని చిరస్థాయిగా నిలపడానికి కలెక్టర్ చేస్తున్న కృషి అభినందనీయమని చెప్పారు. కలెక్టర్ శివ శంకర్ ప్రాచీన వైభవాన్ని కోల్పోయి పాడుబడిపోయిన శిలాశాసనికి ప్రాణ ప్రతిష్టను చేశారని కొనియాడారు. కార్యక్రమంలో భాషోత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు వై.రవికుమార్, గాజులపల్లి గోపీనాథ్ పాల్గొన్నారు

మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - అట్లూరు : ప్రపంచ ఆత్మహత్య నివారణ వారోత్సవాలు సందర్భంగా ప్రజాలందరూ మానసిక ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ కవితా ప్రసన్న తెలియజేశారు. అట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే కార్యక్రమంలో ఆశా కార్యకర్తలకుకు అవగాహన సదస్సు నిర్వహించారు. సైక్రియాట్రిక్ కౌన్సిలర్ సుమన్ బాబు మాట్లాడుతూ మానసికంగా ఇబ్బంది పడేవారిని గుర్తించి ఎప్పటికప్పుడూ వారి అరోగ్య పరిస్థితులు గమనిస్తూ వారిని మానసిక వైద్యులు దగ్గర చికిత్స చేయించాలన్నారు. వ్యక్తులు ఆత్మహత్య చేసుకోవడానికి వివిధ రకాల కారణాలు ఉన్నాయని, ముఖ్యంగా అన్ని సమస్యలకు పరిష్కారం చావు అనే భావన, సరిదిద్దుకోలేని తప్పు చేశాననే భావన భరించలేని శారీరక, మానసిక బాధలు, ఆపుకోలేని ఆవేశం, ఓటమిని భరించలేక మద్యపానంకు బానిస అవడం, భార్య భర్తల మధ్య తరచూ గొడవలు ఇలా ఎన్నో కారణాలు చూపుతారని చెప్పారు. మొబైల్ చూడటం వల్ల పిల్లలలో వచ్చే శారీరక, మానసిక రుగ్మతల గురుంచి వివరించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మాధురి, సిహెచ్ఎన్ లక్ష్మీదేవి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సిపి బ్రౌన్ భవన నిర్మాణ పనులను ప్రారంభించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్



విసికి వినతి పత్రం అందజేస్తున్న పవన్‌కుమార్

సిపి బ్రౌన్ గ్రంథాలయం నూతన భవనం నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలని యోగివేమన విశ్వవిద్యాలయం విసి డాక్టర్ కృష్ణారెడ్డికి పట్టుపోగుల పవన్ కుమార్ మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో సి పి బ్రౌన్ నూతన భవన నిర్మాణానికి నిధులు రూ.6,87,40,000 కేటాయించిందని తెలిపారు. అందులో స్థల యజమానికి రూ.3,21,40,000 ప్రభుత్వం చెల్లించిందని చెప్పారు. నూతన భవనం నిర్మాణం కోసం రూ.3,66,00,000 ను యోగివేమన విశ్వవిద్యాలయం పిడి అకౌంట్లో జమ చేశారని పేర్కొన్నారు. 8 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు నూతన గ్రంథాలయ భవనం నిర్మాణ పనులు ప్రారంభించక పోవడం బాధాకరమని తెలిపారు. విసి కృష్ణారెడ్డి చొరవ తీసుకుని సిపి బ్రౌన్ గ్రంథాలయం నూతన భవనం నిర్మాణ పనులు చేపట్టి త్వరగా పూర్తిచేసి కడప ప్రజలకు మేలు చేయాలని విజ్ఞప్తి చేశారు. పనులు ప్రారంభించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేసేందుకు వెనకాడమని హెచ్చరించారు.

నిరుద్యోగ యువతకు భరోసా

ప్రజాశక్తి- కడప అర్బన్ : నిరుద్యోగ యువతకు కొప్పర్తి పరిశ్రమ భరోసాగా ఉందని సిఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తూనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించబోతున్నారని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్ పేర్కొన్నారు. మంగళవారం టిఎన్ఎస్ఎఫ్ నాయకులు కొప్పర్తి పారిశ్రామిక వాడను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపి అభివృద్ధికి కేంద్రం, రాష్ట్రం కట్టుబడి ఉందన్నారు. ఓర్వకల్లు, కొప్పర్తికి ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలు మంజూరు ఇందుకు నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు భరత్ సింహా, ఫరీద్, కేశవ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జిల్లాలో భారీగా పోలీసుల బదిలీలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలో ఎఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసులను బదిలీ చేస్తూ ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 11 మంది ఎఎస్ఐలు, 95 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 120 మంది పోలీసులను జిల్లాలోని వివిధ స్టేషన్లకు బదిలీ చేశారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

నగర వీధుల్లోని పరిసరాలను శుభ్రంగా ఉంచాలని అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం పేర్కొన్నారు. మార్నింగ్ విజిట్‌లో భాగంగా మంగళవారం రవీంద్ర నగర్ ప్రాంతాన్ని సందర్శించి, ఆ ప్రాంతంలో వివిధ అంశాలను సమీక్షించారు. పారిశుధ్య కార్మికుల హాజరు, యూనిఫామ్, శుభ్రతపై దృష్టి సారించారు. కార్మికుల హాజరు పట్టికలను పరిగణలోకి తీసుకుని, వారికి కేటాయించిన ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. యూనిఫామ్ ధరించడం తప్పనిసరి అని శానిటేషన్ అధికారులకు ఆదేశించారు. నగరంలోని చెత్త పాయింట్లను ఎప్పటికప్పుడూ శుభ్రంగా ఉంచేలా మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు, నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

పీజీ విద్యార్థులకు ఎసిఎల్ఎస్‌పై శిక్షణ

ప్రజాశక్తి-కడప సిటీ

ప్రభుత్వ వైద్యకళాశాలలోని పీజీ విద్యార్థులకు ఎసిఎల్ఎస్ (అడ్వాన్స్‌డ్ కార్డియాక్ లైఫ్ సపోర్ట్)పై రెండు రోజుల శిక్షణను మంగళవారం ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ, ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రమాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్లిష్టమైన స్థితిలో ఉన్న రోగుల ప్రాణాలను కాపాడేదే అధునాతన కార్డియాక్ లైఫ్ సపోర్ట్ స్కిల్స్ అన్నారు. అనస్తీయాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి 39 మంది పీజీ విద్యార్తులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సురేశ్వర్ రెడ్డి, డాక్టర్ విజయ్ బాస్కర్ రెడ్డి, డాక్టర్ వెంకట్రాముడు డాక్టర్ సునీల్ చిరువెళ్ల పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ



క్రీడాకారుడు ఉబేద్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్‌లో బంగారు పతకాలు

- అభినందించిన ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్‌లో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారుడు ఎండి ఉబేద్‌ను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డి అభినందించారు. గతవారం హైదరాబాదు రైఫిల్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరిగిన రైఫిల్ షూటింగ్ రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొన్న 800 మంది క్రీడాకారులతో పోటీపడిన ప్రొద్దుటూరు క్రీడాకారుడు ఉబేద్ 100 మీటర్ల ఎయిర్ పిస్టోల్ పివిపైల్ యూత్ కేటగిరిలో 4బంగారు పతకాలు సాధించాడు. స్థానిక నెహ్రూరోడ్డులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఉబేద్ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డిని కలవగా.. ఆక్రీడాకారుడిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడలలో కూడా నైపుణ్యంతో ముందుకువెళ్లాలని సూచించారు. క్రీడలపై ఆసక్తి ఉన్న పిల్లలను వారి తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, నాయకులు ఘంటసాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పన అధికారి సురేష్‌కుమార్

జాబ్‌మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. 129 మందికి ఉద్యోగం కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా ఉపాధి కల్పన అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధి అవకాశాలను విద్యార్థి దశ నుండి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాబ్‌మేళాలు నియోజకవర్గంలో ప్రతి నెల నిర్వహిస్తామన్నారు. అభి టెక్నాలజీ, అమర్ రాజా గ్రూప్, ముత్తూట్ ఫైనాన్స్, నవత ట్రాన్స్‌పోర్ట్, డిక్సన్ కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూలో 232 మంది అభ్యర్థులు హాజరుకాగా, 129 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎడి మురళీకృష్ణ

దీర్ఘకాలిక భూ సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని చిన్నగులవలూరు గ్రామంలో అయిదేళ్లుగా ఉన్న భూ సరిహద్దు సమస్యను మంగళవారం రెవెన్యూ అధికారులు పరిష్కారం చూపారు. గ్రామానికి చెందిన పాలగిరి శివారెడ్డికి చెందిన సర్వేనెంబర్ 233-2లో 3.50 ఎకరాల పొలం ఉంది. ఈ పొలం సమీపాన ఉన్న ఏసోబు పొలాన్ని ఆక్రమించినట్లు కలెక్టర్‌కు రైతు పలుమార్లు పరిష్కారం కోసం ఫిర్యాదు చేశారు. ఆ మేరకు మండల సర్వేయర్ సాయిలత, జిల్లా సర్వే అధికారి మురళీకృష్ణ సమక్షంలో సమస్యకు పరిష్కారం చూపారు. భూమి కొలతలు వేసి ఇరువురు రైతులకు ఆమోదయోగ్యంగా సమస్యకు పరిష్కారం చూపారు. కార్యక్రమంలో రీ సర్వే డిటి ప్రవీణ్, వీఆర్ఓ, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోండి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని తహశీల్దార్ నజీర్‌బాషా, సిఐ జీవన్ గంగనాథ్ సూచించారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో పులివెందుల మండలం, పట్టణ ఉత్సవ కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసే ప్రతి ఒక్కరూ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. పోలీస్, విద్యుత్‌శాఖ అనుమతి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫైర్‌శాఖ అధికారులు, విద్యుత్‌శాఖ అధికారులు ఉన్నారు.

వేముల : వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న వినాయక విగ్రహాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఆర్కేవ్యాలీ సిఐ నాగరాజు, వేముల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వినాయక ఉత్సవ కమిటీల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్సవ కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. పోలీస్ నిబంధనలను అతిక్రమించకుండా పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముద్దనూరు

కడప-తాడిపత్రి ప్రధాన రహదారి యామవరం గ్రామం సమీపం వద్ద మంగళవారం స్కూటీని మరో స్కూటీ ఢీకొన్న ఘటనలో తుంగ శ్రీనివాసరెడ్డి (50) మృతి చెందాడు. సిఐ దస్తగిరి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన తుంగ శ్రీనివాసరెడ్డి, తమ్ముడు రామానుజులరెడ్డి కలిసి సొంత పని నిమిత్తం స్కూటీలో ముద్దనూరుకు వస్తున్నారు. యామవరం గ్రామ సచివాలయం సమీపం వద్ద వస్తుండగా అదే గ్రామానికి చెందిన సగిలి కిరణ్ కుమార్‌రెడ్డి స్కూటీలో అతివేగంగా వచ్చి శ్రీనివాసరెడ్డి స్కూటీని ఢీ కొట్టాడు. దీంతో శ్రీనివాసరెడ్డి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం ముద్దనూరు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శ్రీనివాసరెడ్డి తమ్ముడు రామానుజులరెడ్డి ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ ఆంజనేయులు కేసు నమోదు చేశారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని పాపాఘ్ని నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. సిఐ సురేష్‌రెడ్డి ఆదేశాలు మేరకు మంగళవారం తెల్లవారుజామున సమాచారం రావడంతో ఎస్ఐ తిరుపాల్ నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లపై దాడులు చేశారు. పాపాఘ్ని నదిలోకి ట్రాక్టర్లు వెళ్లకుండా పోలీసులు గుంతలు కొట్టినప్పటికీ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

ముమ్మరంగా ఖరీఫ్ సాగు

వ్యవసాయ కూలీలకు పెరిగిన డిమాండ్.. అందుబాటులో బెంగాలీ కూలీలు



పొలంలో గట్లు పెడుతున్న కూలీలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని కుందూ, కెసి కెనాల్ పరిధిలో రైతులు వరి నాట్లు ముమ్మరం చేశారు. దీంతో వ్యవసాయ కూలీలకు మంచి గిరాకీ ఏర్పడింది. కాడి ఎద్దులు, ట్రాక్టర్లు, గట్లు వేసే కూలీలు, వరి నాట్లు వేసే కూలీలకు మంచి డిమాండ్ ఏర్పడింది. చాపాడు మండల పరిధిలో 15వేల ఎకరాల్లో వరి పంట సాగుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే 5 వేల ఎకరాల్లో వరి పంట సాగు పూర్తయింది. వారం, పది రోజుల్లో పదివేల ఎకరాల వరకు వరి పంట పూర్తవుతుంది. కాడి ఎద్దులకు మంచి డిమాండ్ ఏర్పడడంతో దువ్వూరు మండలం, మైదుకూరు నుంచి కూడా బాడుగలకు పిలుస్తున్నారు. ఎకరాకు వరి పంట సాగు చేసేందుకు మాను తోలెందుకు ఎద్దులకు రూ.1500 చెల్లించాల్సి ఉంది. గట్లు వేసేందుకు ఒక్కో కూలీకి రూ.600 చెల్లించాల్సి ఉంది. ఎకరాకు గట్లు చెక్కను, పెట్టడానికి ముగ్గురు కూలీల అవసరం. ఎకరా వరి పంట సాగుకు దుక్కిళ్లు చేసేందుకు రెండు దఫాలకు రూ.2800 ఖర్చు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. వరి నాటు కూలీలకు ఎకరాకు రూ.4,600-5వేలు చెల్లిస్తున్నారు. ఎరువులకు రూ.2వేలు కలిపి ఎకరా సాగు ఖర్చులు రూ.15వేలు పైగా అవుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం గట్లు వేయడానికి జివి సత్రం, ఖాజీపేట, దువ్వూరు, ఇతర ప్రాంతాల నుంచి వస్తున్నారు. వారి కూలి ఖర్చులతోపాటు రవాణా ఖర్చులు అదనంగా ఇవ్వాల్సి వస్తోంది. వరి పంట నాటేందుకు బెంగాలీ కూలీలు అధికంగా వలసలు రావడంతో డిమాండు తగ్గింది. ప్రతి ఊరిలో బెంగాలీ కూలీలు అందుబాటులో ఉన్నారు.



వరి నాట్లు వేస్తున్న మహిళా కూలీలు

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ



పౌష్టికాహారంపై మహిళాలకు అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ సునీత

ప్రజాశక్తి - వేంపల్లె

పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనతను నివారించవచ్చని ఐసిడిఎస్ సిడిపిఒ సునీత సూచించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మండలంలోని ఇడుపులపాయిలోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహార మాసోత్సవాలను ఆమె ప్రారభించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు పోషకాహార మాసోత్సవాలను ప్రతి గ్రామంలో నిర్వహించి, సమతుల్య ఆహారం పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, పిల్లలు రక్త హీనత బారిన పడకుండా ఐరన్ ఎక్కువగా ఉన్న ఆకు కూరలు, కూరగాయలు, జొన్నలు, గుడ్డు, మాంసాహార పదార్థాలు, బెల్లం, ఖర్జూరం వంటి వాటిని ప్రతి రోజు ఆహారంలో తీసుకోవాలని కోరారు. పౌష్టి కాహారం తీసుకోకపోతే ఒక్కోసారి ప్రసవంలో రక్త స్రావం అధికంగా జరగవచ్చని తెలిపారు. ఇది ప్రాణాంతకమన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత, ఇడుపులపాయి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శంకర్‌రెడ్డి, మహిళా పోలీసు వర్ధిని, అంగన్వాడీ కార్యకర్త లీలావతి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సింహాద్రిపురం : ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు ఇస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంత కుమారి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అంకాలమ్మ గూడూరు అంగన్వాడీ సెంటర్-1లో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ముద్దనూరు : గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం వల్ల తల్లీ బిడ్డకు క్షేమమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. స్థానిక పిహెచ్‌సిలో మంగళవారం శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆశా కార్య కర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు పోషకాలు కలిగిన ఆహారం తీసుకుంటే వారి ఆరోగ్యంతోపాటు శిశువు ఎదుగుదలకు తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, సూపర్‌వైజర్ శోభాకుమారి, ల్యాబ్ టెక్నీషియన్ జాసన్, ఫార్మాసిస్ట్ జగదీష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీకాంత్

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కూతురంటే కుటుంబానికి భారం కాదని.. ఆ కుటుంబానికి దేవుడిచ్చిన వరం అని వైఎంఆర్ కాలనీ పట్టణ ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ హిమబిందు పేర్కొన్నారు. సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవెలప్‌మెంట్ సొసైటీ (సిర్డ్స్) ఆధ్వర్యంలో మంగళవారం పట్టణ ఆరోగ్యకేంద్రంలో లింగ వివక్షచట్టం 1994పై అవగాహనా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ, మగ పిల్లలిద్దరూ ఒకటే అన్నారు. లింగ వివక్షతో గర్భస్రావానికి పాల్పడి చట్టం ముందు దోషులుగా నిలబడవద్దన్నారు. చట్టాన్ని అతిక్రమించి లింగనిర్ధారణ పరీక్షలు చేసిన వారికి, సహకరించినవారికి 3 నుంచి 5 ఏళ్ల వరకు జైలు శిక్షతోపాటు రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధి స్తారని హెచ్చరించారు. అనంతరం వైఎంఆర్ కాలనీ వీధుల్లో ర్యాలీ నిర్వ హించారు. సిర్డ్స్ అధ్యక్షుడు ఎంవి.సుబ్బారెడ్డి, కార్యదర్శి చెన్నమ్మ, సభ్యులు రమణమ్మ, గంగాభవాని, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు, స్థానికులు పాల్గొన్నారు.

మలేరియా పరీక్షలు అందరికీ చేయాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణంలోని ప్రతి ఇంటికి వెళ్లి మలేరియా పరీక్షలు నిర్వహించాలని డాక్టర్ శాంతకుమారి అన్నారు. మంగళవారం పిహెచ్‌సి నగరిగుట్ట వైద్యాధికారి డాక్టర్ స్నేహ ప్రత్యూష, శాంతకుమారి ఆధ్వర్యంలో ఆరోగ్య కార్యకర్తలకు మలేరియా రక్త పూతలు తీయు విధానం, వెక్టర్ కంట్రోల్, ఫ్రైడే- డ్రైడే గురించి అవగాహన కల్పించారు. ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గ్రామాన్ని సందర్శించి జ్వరం ఉన్న వారికి రక్తపుతల సేకరించి వారానికి మూడు సార్లు ల్యాబ్‌కు అందజేయాలని తెలిపారు. మలేరియా నిర్ధారణ అయితే వెంటనే చికత్స అందించి ఆ వ్యక్తి గ్రామంలో ఫీవర్ సర్వే, లార్వా సర్వే, దోమలు నివారణకు సైఫోనోత్రిన్ పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, డిపిఎమ్ఒ సుబ్బారెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ సంపత్, సురేష్ పాల్గొన్నారు.

అధికారులకు ధన్యవాదాలు : సిఐటియు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

చాలా కాలం నుంచి దొమ్మర నంద్యాల అయ్యగారి వీధి క్రాస్ వద్ద రోడ్డు పొడవునా వర్షపు నీరు ఉన్నందున స్థానికులు, వాహనదారులు చాలా ఇబ్బందులు పడేవారని, సమస్యను సిఐటియు నాయకులు పత్రికల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు వెంటనే స్పందించిన అధికార యంత్రాంగం, ప్రతినిధులకు ధన్యవాదాలని సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్ పేర్కొన్నారు. సిఐటియు నాయకులు స్థానిక ప్రజలు కలిసి పెద్ద ఎత్తున నిరసన చేపట్టిన వెంటనే అధికారులు గ్రామ సెక్రెటరీ, సర్పంచ్ స్పందించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించారన్నారు. స్పందించినందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

వైద్య సహకారం అందరికీ అందాలి : ఎంపిజె

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

నిరుపేద రోగులకు వైద్య, ఆర్థికసాయమైన ఆరోగ్యశ్రీ, సిఎంఆర్ఎఫ్ రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ అందాలని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపిజె) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం కోరారు. స్థానిక తమ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైద్య ఆరోగ్య సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిజె ఈనెల 1వ తేదీ నుంచి 15వ తేదీవరకు ఉద్యమాన్ని నిర్వహిస్తోందన్నారు. అన్ని ప్రభుత్వాసుపత్రులలో రోగులకు అవసరమైన సేవల గురించి దర్యాప్తు చేసి మెరుగైన సేవలందించాలన్నదే తమ ధ్యేయమన్నారు. సమాజశ్రేయస్సుకు అవసరమైన అన్ని కార్యక్రమాల అమలుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి, పట్టణ అధ్యక్షుడు హుసేన్‌బాషా, కార్యదర్శి మహమ్మద్‌రఫి, అల్లాబకష్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

జమ్మలమడుగు రూరల్ : గణపతి పండుగకు ప్రజలందరూ మట్టి గణపతులు ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాఫిక్ పాషా తెలిపారు. మంగళవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ ముద్రించిన మట్టి గణపతులను ప్రతిష్ఠిద్దాం-పర్యావరణాన్ని కాపాడుదాం' అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముందుగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వ హిస్తున్న యువజన సంఘానికి అభినందనలు తెలిపారు. డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కాటిగాళ్ళ ప్రసాద్ మాట్లాడుతూ యువజన సంఘం పోరా టాలే కాదు.. ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు కూడా నిర్వహిస్తుందన్నారు. పట్టణ నాయకులు సూరి, నరసింహ, పుష్పరాజ్ పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ రఫిక్ పాషా, డివైఎఫ్ఐ నాయకులు



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

స్వీపర్లకు రూ.16 వేలు వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న స్వీపర్లకు జీవో ప్రకారం రూ.16 వేలు వేతనం ఇవ్వాలని, నాలుగు నెలలుగా వేతన బకాయిలు చెల్లించాలని, పిఎఫ్, ఇఎస్ఐ సదుపాయాలు కల్పించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, సిఐటియు పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆస్పత్రిలో పనిచేసే స్వీపర్లకు ప్రభుత్వం రూ.16,000 వేతనాలు చెల్లించాల్సి ఉంది.. కానీ కాంట్రాక్టర్ తక్కువ వేతనాలు ఇచ్చి అది కూడా నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెలలు తరబడి జీతాలు ఇవ్వకపోతే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయన్నారు. వెంటనే వారికి రూ.16 వేల వేతనాలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలు వారి అకౌంట్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో సిఐటియు పట్టణ కార్యదర్శి రాఘవ, డివైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

పంట నమోదుతో రైతులకు లబ్ధి

ప్రజాశక్తి - ముద్దనూరు

పంట నమోదు చేసుకోవడం వల్ల రైతులకు లబ్ధి చేకూరుతుందని మండల వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని ఓబుళాపురం గ్రామంలో పంట నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ఎఒ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి పంటను రైతులు తప్పనిసరిగా నమోదు, ఇకేవైసి చేసుకోవాలన్నారు. ఇకేవైసి కాకపోతే ప్రభుత్వం అమలు చేసే ఏ పథకం వర్తించదన్నారు. పంట నమోదు చేయించుకోవడం రైతు బాధ్యతగా పేర్కొ న్నారు. ఈనెల 15వరకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో విఆర్ఒ శ్రావణి, అభ్యుదయ రైతులు మహేశ్వరరెడ్డి, రామాంజిరెడ్డి, సందిరెడ్డి పాల్గొన్నారు.



అన్నవరం వద్ద కుందూ నది ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నిమజ్జనానికి ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - చాపాడు

వినాయక నిమజ్జనం సందర్భంగా మండల పరిధిలోని సీతారామపురం, అన్నవరం గ్రామాల వద్ద కుందూ నదిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం మండల అధికారుల బృందం పరిశీలించింది. తహశీల్దార్ రవీంద్రారెడ్డి, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, ఎస్ఐ చిన్న పెద్దయ్య, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి పరిశీలించారు. కుందూ నదిలో వరద నీరు అధికంగా వస్తుందని, నదికి ఇరువైపులా బారీకేడ్లు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. విఆర్ఎలు, పోలీస్ సిబ్బంది నిమజ్జనం సందర్భంగా నది వద్ద అందుబాటులో ఉండేలా సిబ్బందిని నియమించాల్సి ఉందన్నారు. ప్రజలు కూడా నిమజ్జనం సందర్భంగా జాగ్రత్తలు పాటించాలని తహశీల్దార్, ఎస్ఐ కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలు, విఆర్ఎలు పాల్గొన్నారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

విజయవాడ విపత్తును జాతీయ విపత్తుగా కేంద్రం ప్రకటించి, బాధితులకు ఆర్థికసాయం చేయాలని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి తెలిపారు. అంతేకాక ఆయా ప్రాంతాల్లో మరమ్మతులు చేసేందుకు వెంటనే నిధులు విడుదల చేసి రాష్ట్రాన్ని ఆదుకోవాలని కోరారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయవాడ విపత్తు బాధాకరం, దురదృష్టకరమన్నారు. వరదల వల్ల 19 మంది చనిపోవడంతోపాటు ఇద్దరు వ్యక్తులు గల్లంతు అయినట్లు చెప్పారు. అలాగే 136 పశువులు, 5,9700 కోళ్లు మృతి చెందినట్లు అధికారులు చెప్పినట్లు తెలిపారు. రైతులకు సంబంధించి 4.26 లక్షల ఎకరాల్లో వరి పంట, 39,964 ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బ తినడం ఆందోళనను కలిగిస్తోందన్నారు. 1808 కిలోమీటర్ల రోడ్లు దెబ్బ తిన్నాయన్నారు. 73 చెరువులకు గండ్లు పడ్డాయన్నారు. ఇంకా 2.5 లక్షల మంది ముంపు ప్రాంతాలలోనే ఉన్నట్లు తులసిరెడ్డి వివరించారు. ముందు జాగ్రత్తలు తీసుకోవడంలో ప్రభుత్వం వైఫల్యం చెందినట్లు స్పష్టంగా తెలుస్తోందని విమర్శించారు. వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లోపం కూడా కనిపిస్తోందన్నారు. ప్రస్తుతం పునరావాస కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగించడం సంతోషకరమని తెలిపారు. ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు నిర్విరామంగా సహాయ కార్యక్రమాలలో పాల్గొనడం అభినం దనీయమన్నారు. విజయవాడలో వరద బాధితులను కాపాడేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సహాయక కార్యక్రమాల్లో పాల్గొనాలని తులసిరెడ్డి పిలుపునిచ్చారు.

సహాయక చర్యలకు వెళ్లిన సిబ్బంది

ప్రజాశక్తి - సింహాద్రిపురం

విజయవాడతోపాటు దాని చుట్టుపక్కల కృష్ణానది పరివాహ ప్రాంతంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జలమయమైన ప్రాంతాల్లో సహాయ చర్యలు చేపట్టేందుకు మండలం నుంచి పంచాయతీ సిబ్బంది వెళ్లారు. వారిని మంగళవారం ఎంపిడిఒ కృష్ణమూర్తి, ఈఓపిఆర్‌డి పద్మనాభరెడ్డి పర్యవేక్షణలో జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు ప్రత్యేక వాహనంలో పంపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల్లో పాల్గొనడానికి ఎనిమిది మంది పంచాయతీ సెక్రెటరీలను పంపినట్లు ఎంపిడిఒ తెలిపారు.

జిఎస్‌టి రద్దు చేసేదాకా ఉద్యమిస్తాం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



మాట్లాడుతున్న అవధానం శ్రీనివాస్

ఎల్ఐసి ప్రీమియం పై జిఎస్‌టిని రద్దు చేసే వరకు ఉద్యమిస్తామని కడప డివిజన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్ తెలిపారు. స్థానిక జీవిత బీమా సంస్థలో మంగళవా రం ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లా యిస్ యూనియన్ జమ్మలమ డుగు యూనిట్ సర్వసభ్య సమా వేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అవ ధానం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఎస్. అక్బర్‌బాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా అవధానం శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల తమ ప్రచార ఉద్యమం వల్ల కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసి ప్రీమియంలపైన, హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమి యంలపైన జిఎస్‌టి రద్దుపై వచ్చే జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో సమీక్షిస్తామని ప్రకటిం చారన్నారు. ఉపాధ్యక్షుడు అక్బర్ బాషా మాట్లాడుతూ ఈనెల 14, 15 తేదీల్లో కడపలో జరుగు డివిజనల్ మహాసభలో బీమా రంగ సమస్యలపై భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తామన్నారు. అనంతరం జమ్మలమడుగు బ్రాంచ్ యూనిట్‌కు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా ఎ.బాలరాజు, ఉపా ధ్యక్షుడు డి నరసింహం, కార్యదర్శి డి.వి సుధాకర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి ఎం.సతీష్, కోశాధికారి బి.శ్రీహరి నాయక్, కార్యవర్గ సభ్యుడు కె.శ్రీధర్, డివి. సుబ్బయ్య, కే.సుబ్బరాయుడు, కే.నాగరాజు, ఎస్ఎం బాషా, వి.జనార్ధనయ్య, బి.ప్రభావతమ్మను ఎన్నుకున్నారు.

జాతీయ స్థాయిలో సత్తాచాటిన 'విశ్వజ్యోతి' విద్యార్థులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం, ప్రిన్సిపల్

సౌత్‌జోన్ టార్గెట్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ టీమ్‌కు తమ పాఠశాల విద్యార్థులు ప్రాతి నిధ్యం వహించి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారని విశ్వజ్యోతి ఇంగ్లీషు మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ మారెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం స్థానిక పాఠశాలలో ఆయన మాట్లాడుతూ గత నెల 30, 31, ఈ నెల 1వ తేదీ ఛాంపియన్షిప్ పోటీలలో పాల్గొని రెండవ స్థానంలో నిలిచినందుకు అభినందనలు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపల్ కిరణ్ మాట్లాడుతూ రంగ నిఖిలేష్, నాసీర్, జయచరణ్ తేజను స్ఫూర్తిగా తీసుకుని మిగతా విద్యార్థులందరూ జీవితంలో ముందుకు సాగాలని సూచించారు. వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మన విద్యార్థులు చదువుల్లోనే కాకుండా ఆటల్లోనూ ముందుంటారని, మన రాష్ట్రానికి మంచి పేరు తీసుకువచ్చారని, రాబోయే కాలంలో దేశానికి కూడా ప్రాతినిధ్యం వహిస్తారని ఆకాంక్షించారు. కారక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పిఈటిలు షాహినా, సంజీవ్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.